# కళ్ళజోడు

**రామ్మూర్తి** కళ్ళు పరీక్షించి మందులు రాసాడు ఐ స్పెషలిస్టు సంజయ్‌కుమార్.

"గ్లాసెస్ ఏవైనా...." గొణిగాడు రామ్మూర్తి.

"అవసరం లేదు. ఈ మందులు వాడండి సరిపోతుంది."

డాక్టర్ రాసిచ్చిన మందుల చీటీ పట్టుకుని హాస్పిటల్ నుండి బయటపడ్డాడు. ఈ మధ్య అతనికి తరచూ తలనొప్పి వస్తోంది. డాక్టర్ అద్దాలు రాసిస్తాడేమోనన్న ఉబలాటంతో ఆ రోజు ఆఫీసుకు సెలవు పెట్టి మరీ వెళ్ళాడు. ప్చ్...తన కోరిక నెరవేరితేనా? రామ్మూర్తికి కళ్ళజోడు పెట్టుకోవాలన్న కోరిక ఈనాటిది కాదు. చిరకాల వాంఛ. అద్దాలు అక్కర్లేదన్నపుడు మందులు దేనికని అనుకుని ప్రిస్క్రిప్షన్ చించేసాడు కసిగా.

రోడ్డు మీద నడుస్తున్నాడన్న మాటేగానీ అతడి మనసంతా గందరగోళంగా వుంది. తన ఈ అతి చిన్న కోరికను సమాధిచేసిన సంఘటనలు మెల్లమెల్లగా మస్తిష్కంలో మెదలసాగేయి.

★ ★ ★

సమితాఫీసులో వెలగబెడుతున్న గుమస్తాగిరి ద్వారా సంక్రమించే చాలీచాలని జీతంతో సముద్రంలాంటి సంసారాన్ని ఈదేందుకు సాహసిస్తున్నాడు జోగారావు. అతడి ప్రథమ సంతానమే రామ్మూర్తి. వాడికి పదేళ్ళుంటాయి. బోర్డు స్కూల్లో ఏడోతరగతి చదువుతున్నాడు. పుస్తకముంటే పెన్ను లేక, పెన్నుంటే పుస్తకంలేక పంతుళ్ళ చేత చింతరువ్వతో దరువు వేయించుకుంటూ తోటి విద్యార్థుల అవహేళన నడుమ దీనాతిదీనంగా విద్యాభ్యాసం కొనసాగిస్తున్నాడు.

మునసబుగారబ్బాయి ముకుందం ఓరోజు ప్లాస్టిక్ కళ్లజోడు తగిలించుకుని స్టిల్ కొడుతూ రామ్మూర్తి వద్దకొచ్చాడు.

నీలిమేఘవర్ణంలో మిలమిల మెరిసిపోతున్న ఆ కళ్లజోడు రామ్మూర్తిని అమితంగా ఆకర్షించింది.

"కళ్లజోడు బాగుంది. ఎక్కడ కొన్నావ్?" అడిగాడు.

"నేను కొనలేదు. మా మామయ్య పట్నం నుండి పట్టుకొచ్చాడు. ఎలా వుంది? కత్తిలా లేదూ?" అంటూ దర్పంగా కళ్లజోడు తీసి రుమాలుతో తుడిచాడు ముకుందం. తనకి కూడా ఎవరైనా అటువంటి కళ్లజోడు కొనిస్తే బాగుండుననిపించింది రామ్మూర్తికి.

రాత్రి పడుకున్నాడన్న మాటేగానీ నిద్రరావడం లేదు. మాటిమాటికీ ముకుందం కళ్లజోడే ఆ పసివాడి మదిలో మెదలసాగింది.

తెల్లవవారుఝామున అనూహ్యంగా దిగబడ్డాడు మాధవయ్య. పెదనాన్న రాకతో రామ్మూర్తిలో ఆశ చిగురించింది. మాధవయ్యకు పిల్లలు లేరు. తమ్ముడి పిల్లలంటే అతనికి అమితమైన ప్రేమ. వచ్చినప్పుడల్లా పిల్లలకు కొత్తబట్టలు పట్టుకొస్తాడు. వాళ్ళు కోరినవి కొనిస్తాడు.

తన కోరికను పెదనాన్న ముందు బయట పెట్టాడు రామ్మూర్తి.

"నూకాలమ్మ జాతరలో రకరకాల వస్తువులు అమ్ముతారు. అప్పుడు నీకు కావాల్సిన కళ్లజోడు కొనుక్కుందువుగానిలే" అభయమిచ్చాడు మాధవయ్య.

పెదనాన్న మాటలకు బూరిలా ఉబ్బిపోయాడు రామ్మూర్తి. కళ్లజోడు తగిలించుకున్నట్లే సంబరపడిపోయాడు. నాటినుండి నూకాలమ్మ పండగ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూడసాగాడు.

అనుకున్న పండుగ వచ్చింది.

జాతర్లోకి సాయంత్రం వెళదామన్నాడు మాధవయ్య.

మధ్యాహ్నం మూడవకుండానే ఉతికి ఆరేసిన లాగు కమీజు తొడుక్కుని ముస్తాబయ్యాడు రామ్మూర్తి.

పండగ ఊరేగింపుతో మొదలైంది. పులివేషాలు, కోయనృత్యాలు, తప్పెటగుళ్లతో ఊరు మార్మోగుతోంది. జాతరలో రకరకాల ఆటవస్తువులు, పలురకాల తినుబండారాలు బారులు తీర్చి ఉన్నాయి.

మాధవయ్య రామ్మూర్తికి లడ్డూలు కొనిచ్చాడు. అతడికవేవీ తినబుద్ధి కాలేదు. ఆ పసివాడి కళ్లన్నీ ప్లాస్టిక్ కళ్లజోడు కోసం ఆత్రంగా వెతుకుతున్నాయి. మొత్తానికి అతడి ఆశ ఫలించింది. ఓ చోట ఆట వస్తువులతో పాటు రెండు పుంజీలు కళ్లజోళ్ళు కనిపించాయి. జిగేలుమన్నాయి అతడి కళ్ళు.

మాధవయ్య కళ్ళజోడు తీసి రామ్మూర్తికిస్తూ దాని ధర అడిగాడు.

"రూపాయి ముప్పావలా" అన్నాడు కొట్టువాడు.

పదిరూపాయల నోటు అందించాడు మాధవయ్య.

"చిల్లరలేదు" పెదవి విరిచాడు దుకాణదారుడు.

"సరే, చిల్లర పట్టుకొచ్చి తీసుకుంటాన్లే" రామ్మూర్తి చేతిలోంచి కళ్ళజోడు లాక్కుని కొట్టువాడికిచ్చాడు.

రామ్మూర్తి మనసు చివుక్కుమంది. తనిన్నాళ్ళుగా కలలు కంటున్న కళ్ళజోడు చేతికందినట్లే అంది జారిపోవడంతో ప్రాణం జివ్వుమంది.

మాధవయ్య చిల్లరకోసం తిరిగి తిరిగి వచ్చేసరికి కళ్లజోళ్ళన్నీ అమ్ముడైపోయాయి. మచ్చుకి ఒక్కటైనా మిగల్లేదు. ఏడుపొచ్చింది రామ్మూర్తికి. అతడి కళ్ళు నిండుకుండలయ్యాయి. గుండెలోతుల్లోంచి దుఃఖం పెల్లుబికింది. అతడిని ఓదార్చడానికి మాధవయ్య చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

అత్తెసరు మార్కులతో యస్‌యస్‌సి అయిందనిపించిన రామ్మూర్తికి తన పలుకుబడితో ఓ చిన్న ఉద్యోగం వేయించాడు జోగారావు. ఉద్యోగంలో చేరి నిండా మున్నాళ్ళు కాలేదు. నాయనమ్మ కోరిక మేరకు రామ్మూర్తికి పెళ్లికూడా అయిపోయింది. సంసారభారం నెత్తిన పడింది. అంతేకాదు, అవివాహితలైన మేనత్తల పోషణభారం కూడా తనమీదే పడింది. దాంతో ఉద్యోగంలో చేరాక కూలింగ్ గ్లాసెస్ కొనుక్కోవాలన్న కోరిక కోరికగానే మిగిలిపోయింది.

రామ్మూర్తి నాలుగో పదిలో పడేసరికి మేనత్తలు కాలం చేసారు. తల్లిదండ్రులు దివంగతులయ్యారు. ఉద్యోగమవడంతో పెద్దకొడుకు విశాఖపట్నం వెళ్లిపోయాడు. బాధ్యతలన్నీ తీరిపోయాయి. ఎప్పటినుండో తనలో నిబిడీకృతమైన కళ్లజోడు కోరిక మళ్లీ తలెత్తింది. ఈ వయసులో మరీ కుర్రాడిలా కూలింగ్ గ్లాగుల్స్ తగిలించుకుంటే ఏం బావుంటుందనుకున్నాడు. కాకతాళీయంగా తలనొప్పి రావడంతో ఐ స్పెషలిస్టును సంప్రదించాడు. అయితే డాక్టరు మందులు తప్ప కళ్లజోడు జోలికి పోవద్దన్నాడు.

లోకంలో తనవంటి నిర్భాగ్యులకు అతి చిన్న కోరికలు కూడా తీరవేమోననిపించింది.

ఆలోచనలకు స్వస్తిచెప్పి గుమ్మంలో అడుగుపెట్టాడో లేదో "నాన్నా" అంటూ ఎదురొచ్చాడు పెద్దకొడుకు నిఖిల్.

"ఊరునుండి నువ్వెప్పుడొచ్చావురా?" అంటూ ఆప్యాయంగా తనయుడి భుజం మీద చేయివేసాడు రామ్మూర్తి.

"ఇప్పుడే వచ్చాను నాన్నా. చూడు నీ కోసం ఏం తెచ్చానో?" అంటూ జేబులోంచి రేబన్ గ్లాసెస్ తీసాడు.

కలా, నిజమా అనిపించింది రామ్మూర్తికి.

గిచ్చుకుని చూసుకున్నాడు.

ఆశగా కళ్ళజోడు అందుకోబోయాడు.

చేయిజారి అద్దాలు కిందపడ్డాయి.

"సారీ నాన్నా. పోతే పోయిందిలే. మళ్ళీవచ్చినప్పుడు మరో కళ్లజోడు పట్టుకొస్తాను. నువ్వేం దిగులు పడకు" అన్నాడు నిఖిల్ నొచ్చుకుంటూ.

విరక్తిగా నవ్వి ఊరుకున్నాడు రామ్మూర్తి.

సకలశాస్త్రాల్లోని వేదాంతసారం ఆ నవ్వులో గోచరిస్తోంది.

**(నవంబరు 2000 ఆంధ్రభూమి మంత్లీ )**